

మరో ఐదు కరోనా కేసులు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం మరో ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. మొత్తం 83 మందికి పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. వీటితో మొత్తం కేసుల సంఖ్య 43కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో 30 యాక్టివ్ కేసులు ఉన్నాయి. వీరిలో 25 మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మార్కెట్లు, రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలంటున్నారు.

పింఛన్లు ఎక్కడ?

ఈ నెల ఇంకా పంపిణీ చేయని వలంటీర్లు

- డబ్బులు రాలేదని వెల్లడి
- 5న మీటింగ్‌లు నిర్వహించిన తరువాత ఇస్తారంటూ సమాచారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెంచిన పింఛన్లు అందుకునే భాగ్యం ఎప్పుడు?...అంటూ లబ్ధిదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. వైసీపీ గత ఎన్నికల సమయంలో పింఛన్లను రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాదికి రూ.250 చొప్పున మాత్రమే పెంచుకుంటూ వస్తోంది. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా...ఇప్పుడు రూ.2,750 నుంచి రూ.3 వేలు చేసింది. జనవరి ఒకటో తేదీన వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. సాధారణంగా ఒకటో తేదీ ఉదయాన్నే అందరి ఇళ్లకు వచ్చి వేలిముద్రలు వేయించుకొని వలంటీర్లు డబ్బులు ఇవ్వాలి. కానీ కొత్త సంవత్సరంలో జగనన్న ప్రభుత్వం వారికి ఝలక్ ఇచ్చింది. పింఛన్లు పెంచినట్టు ప్రచారం అయితే చేసుకుంది గానీ ఇప్పటివరకూ ఏ లబ్ధిదారుడికి రూపాయి కూడా పంపిణీ చేయలేదు. వలంటీర్లను అడిగితే ఇంకా డబ్బులు రాలేదని చెబుతున్నారు. కొందరైతే ఎప్పుడు వస్తాయో కూడా స్పష్టంగా చెప్పడం లేదు. పెంచిన రూ.250కి విస్తృత ప్రచారం చేసుకొని ఇంకా డబ్బులు ఇవ్వకపోవడం ఏమిటని వృద్ధులు వాపోతున్నారు.

5న మీటింగ్‌కు వస్తేనే ఇస్తారట

దీనిపై వార్డు సచివాలయాల సిబ్బందిని ప్రశ్నించగా, డబ్బులు రాని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఈ నెల ఐదవ తేదీన వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో వార్డుల వారీగా భారీ సమావేశాలు నిర్వహించి, అందరికీ అక్కడే పింఛన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అక్కడికి వస్తేనే ఈ నెల పింఛన్లు అందుతాయని, రాలేని వృద్ధులు ఎవరైనా ఉంటే వారికి ఆ తరువాత వలంటీర్లు తీసుకువెళ్లి ఇస్తారని వివరించారు. అంటే పెంచిన పింఛన్ల పంపిణీని కూడా పార్టీ కార్యక్రమంలా నిర్వహించి, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకునే యత్నం చేస్తున్నారు.

వైసీపీకి దాడి గుడ్‌బై

వైసీపీకి వరుస షాక్‌లు





- పార్టీని వీడుతున్న సీనియర్లు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ల రాజీనామా
- ఇప్పుడు వీరభద్రరావు కుటుంబం...
- నేడు అమరావతిలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక

దాడి వీరభద్రరావు



దాడి రత్నాకర్



దాడి జయవీర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఎన్నికల ముంగిట పలువురు సీనియర్ నేతలు పార్టీని విడిచిపెడుతున్నారు. సుమారు ఏడాదిపాటు విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేశ్‌బాబు మూడు, నాలుగు నెలల క్రితం పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. ఇక ఇటీవల వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో వంశీకృష్ణ జనసేనలో చేరగా, సుధాకర్ టీడీపీలో చేరనున్నట్టు చెబుతున్నారు. తాజాగా అనకాపల్లి జిల్లాలో వైసీపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్, మరో కుమారుడు జయవీర్ మంగళవారం మధ్యాహ్నం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో కలకలం రేపగా, వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సుదీర్ఘకాలంపాటు తెలుగుదేశం పార్టీలో ఉండి, 2013లో ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఆయన కుమారుడు దాడి రత్నాకర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం దాడి వీరభద్రరావు కుటుంబం వైసీపీ నుంచి బయటకు వచ్చింది. కొంతకాలంపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరతారన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ..2019 సార్వత్రిక ఎన్నికల ముందు మళ్లీ వైసీపీలో చేరారు. అనకాపల్లి అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో ఒకింత నిరాశ చెందారు. అయినప్పటికీ వైసీపీ విజయం కోసం కష్టపడి పనిచేశారు. పార్టీ అధికారంలోకి రావడంతో తగిన ప్రాధాన్యం లభిస్తుందని భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు/ఎంపికలు జరిగినప్పుడు, నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యుల పేర్లు తెరపైకి రావడం, పార్టీ అధిష్ఠానం మొండి చేయి చూపడం జరుగుతూ వస్తోంది. గత ఎన్నికల్లో అమర్ గెలుపునకు కృషి చేసినప్పటికీ పార్టీ పెద్దలు గుర్తించకపోవడం, ఎమ్మెల్సీ సీటు హామీని జగన్ నిలుపుకోలేకపోవడం, సొంత పార్టీ ... మిగతా 6వ పేజీలో

కొణతాలతో కేవీపీ మంతనాలు?

కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానం

- ఆయన వెంటే వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి?



విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ మార్పులు చకచకా చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీ వైసీపీ కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను మార్చడం, ఎన్నికల బరిలో ఎవరు ఉంటారో స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా చేసిన కొణతాల రామకృష్ణ ఇప్పుడు రాజకీయంగా మళ్లీ క్రియాశీలకం అవుతున్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కొణతాల...జగన్ వెంట నడిచారు. అయితే ఆయన విధానాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరలేదు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయితే గత కొద్దిరోజులుగా ఆయన మళ్లీ తన వర్గంతో చర్చలు జరుపుతున్నారు. ఉత్తరాంధ్రాతో పాటు ముఖ్యంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఆయన శిష్యులు చాలామంది ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఆమె రాష్ట్ర పార్టీ బాధ్యతలు స్వీకరిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తరఫున కేవీపీ రామచంద్రరావు పాత కాంగ్రెస్ నాయకులందరితో చర్చలు జరుపుతున్నారు. కేవీపీకి కూడా కొణతాల రామకృష్ణ సన్నిహితుడే. కాంగ్రెస్‌లోకి రావాలని కేవీపీ ఆహ్వానించినట్టు, అందుకు కొణతాల అంగీకరించినట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ వైపు నాగిరెడ్డి అడుగులు?

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేమని గాజువాక ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వైసీపీ అధిష్ఠానం చాలా స్పష్టంగా చెప్పేసింది. పార్టీ అవకాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన తనయుడు దేవన్‌రెడ్డి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అధిష్ఠానం టికెట్ ఇవ్వబోమని చెప్పడంతో పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. పార్టీ పెద్దలు బుజ్జగించి తొందర పడవద్దని వారించారు. రెండు రోజుల క్రితం గాజువాకలో జరిగిన పార్టీ సమావేశంలో కూడా నాగిరెడ్డి వర్గీయులు ఆయనకే టికెట్ ఇవ్వాలని పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ముందు డిమాండ్ చేశారు. అయితే ఉరుకూటి చందుకే టికెట్ ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో తిప్పల కుటుంబం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. ఈ కుటుంబానికి గతంలో కాంగ్రెస్ పార్టీతోనే సుదీర్ఘ అనుభవం ఉంది. ఆ పార్టీ నుంచే తిప్పల సోదరుడు గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వీరంతా కొణతాలకు శిష్యులు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి షర్మిల సారథం వహించనున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గాజువాక నుంచి పోటీ చేయడానికి అవకాశం ఇస్తే ఆ పార్టీలో చేరడానికి నాగిరెడ్డి కుటుంబం ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది.

వాగులో జగనన్న కాలనీ

- ఇదీ ఆనందపురం మండలం కణమాం లేఅవుట్ పరిస్థితి
- అయినా పట్టించుకోని అధికారులు
- ఇళ్ల నిర్మాణం కొనసాగింపు
- అక్కడ నివాసం ఉండడం కష్టమంటున్న లబ్ధిదారులు



ఆనందపురం మండలం కణమాంలో ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయిన జగనన్న కాలనీ లే అవుట్

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): **నగరంలో పేదల కోసం శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న జగనన్న కాలనీలు నివాసానికి అనువుగా లేవన్న ఆరోపణలు/విమర్శలపై అధికారులు కనీసం స్పందించడం లేదు. వర్షపు నీరు ప్రవహించే గెడ్డల్లో లబ్ధిదారులకు ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందుకు కణమాంలోని జగనన్న కాలనీయే నిలువెత్తు నిదర్శనం.**

నగర శివారునున్న ఆనందపురం మండలంలో ఎక్కువగా జగనన్న కాలనీలకు లేఅవుట్‌లు అభివృద్ధి చేశారు. గిడిజాల లేఅవుట్‌కు ఆనుకుని కణమాం పంచాయతీలో గెడ్డవాగులు ప్రవహించే ప్రాంతంలో లేఅవుట్ అభివృద్ధి చేశారు. సుమారు 30 ఎకరాల్లో 1,300 మందికి పట్టాలు పంపిణీ చేశారు. గిడిజాల లేఅవుట్‌లో 90 శాతం ఎత్తైన ప్రాంతం కావడంతో ఇళ్ల నిర్మాణాలకు అనువుగా ఉంది. ఇక కణమాం లేఅవుట్‌లో 30 శాతం వరకూ ఇబ్బంది లేదు. మిగిలిన ప్లాట్లలో నిర్మాణాలు చేస్తే నివాసం ఉండడం కష్టమని లబ్ధిదారులు వాపోతున్నారు. కొండల నుంచి గట్టిగా వరద వస్తే ప్లాట్లకు కేటాయించిన ప్రాంతంలో నడుము లోతు నీరు నిల్వ ఉంటుందని స్థానిక రైతులు వివరించారు. ఇప్పటివరకు కణమాం జగనన్న కాలనీలో 350 ఇళ్లకు పునాదులు తీసిన కాంట్రాక్టర్ 200 ఇళ్లకు సంబంధించి బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు చేపట్టారు. లేఅవుట్ ఎగువ భాగంలో 100 ఇళ్లు రూఫ్ వరకూ నిర్మించిన కాంట్రాక్టర్ 30 ఇళ్లకు స్లాబులు వేశారు. వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నట్టు ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందే చెబుతున్నారు. ఇంకా లేఅవుట్ మధ్యలో రెండు గెడ్డలు ప్రవహిస్తున్నాయి. వర్షాకాలంలో వరద వస్తే గెడ్డలకు దక్షిణ భాగంలో కణమాం గ్రామం వైపు ఉన్న ప్లాట్ల వైపునకు వెళ్లడం సాధ్యం కాదని గ్రామానికి చెందిన అప్పలరాజు అనే రైతు పేర్కొన్నారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లడానికి తామే అనేక ఇబ్బందులు పడుతుంటామని, అటువంటిది ఆ ప్రాంతంలో కాలనీ నిర్మిస్తే ప్రజలు ఎలా ఉంటారని ప్రశ్నించారు. నగర శివారుల్లో వేసిన లేఅవుట్‌లలో చాలా వరకు నీరు ప్రవహించే ప్రాంతాలున్నా అధికారులు పట్టించుకోకుండా ప్లాట్లుగా అభివృద్ధి చేసి తమకు అప్పగించారని గృహ నిర్మాణ సంస్థ అధికారి ఒకరు వాపోయారు. జిల్లా యంత్రాంగం ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

కాగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో 680 మందికి, విశాఖ దక్షిణ పరిధిలో 180 మందికి, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో 100 మందికి, భీమిలి పరిధిలోని 80 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు కణమాంలో ప్లాట్లు కేటాయించారు. కణమాం లేఅవుట్ ఎంవీపీ కాలనీకి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉందని, నగరంలో చిన్నచిన్న పనులు చేసుకునే తమకు అంత దూరంలో ఇళ్లు...అది కూడా గెడ్డవాగులో ఇస్తే ఎలా నివాసం ఉంటామని ఒక మహిళ ప్రశ్నించారు. గెడ్డవాగులో కేటాయించిన ప్లాట్లు రద్దు చేసి కొండకు ఆనుకుని ఎత్తైన ప్రాంతంలో ఇస్తే మంచిదని కోరుతున్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్స్

ఈనెల 8 నుంచి 20వ తేదీ వరకు

- 600 ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయం
- సాధారణ చార్జీలే వసూలు చేయనున్నట్టు అధికారుల వెల్లడి

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 2: సంక్రాంతిని పురస్కరించుకుని 600 ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రజా రవాణా శాఖ (పీటీడీ)/ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, చెన్నై, భీమవరం, కర్నూలు వంటి దూర ప్రాంతాలకు 200, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, శ్రీకాకుళం, పలాస, టెక్కలి, సోంపేట వంటి చోట్లకు 400 ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈనెల 10 నుంచి 14 వరకూ ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్ వైద్యుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు?

- ఇంట్లో పనిమనిషి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు ఆరోపణలు రావడంతో కేజీహెచ్‌లో పనిచేస్తున్న ఒక వైద్యుడిపై మహారాణిపేట పోలీసులు మంగళవారం కేసు నమోదుచేసినట్టు తెలిసింది. సదరు వైద్యుడు లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఆయన ఇంట్లో పనిచేస్తున్న మహిళ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు రామాటాకీస్ సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో సదరు వైద్యుడు ఉన్నట్టు తెలుసుకుని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లారంటున్నారు. మఫ్టీలో ఆస్పత్రికి వెళ్లిన పోలీసులను గుర్తించి వైద్యుడు ...మొదటి అంతస్థు నుంచి వెనుక వైపునున్న ర్యాంప్ మీదుగా కిందకు దిగి పరారైనట్టు సమాచారం. వైద్యుడు తన కారును కూడా ఆస్పత్రి వద్ద వదిలేశారు. ఆయన పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసు గురించి మహారాణిపేట పోలీసులతోపాటు ఈస్ట్ ఏసీపీని సంప్రతించేందుకు యత్నించగా...బిజీగా ఉన్నామని, తర్వాత మాట్లాడుదామంటూ సమాధానం దాటవేశారు.



పితాపురం కాలనీ వద్ద రహదారిపై పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యం ఘోరం

సమ్మెలో పారిశుధ్య కార్మికులు

- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు
- రోడ్లపై చెల్లాచెదురు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. జీవీఎంసీ పరిధిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గత నెల 26 నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలంతా ఇళ్లలోని చెత్తను డంపర్‌బిన్‌ల వద్ద పడేస్తున్నారు. దీంతో నగరంలో ఏ రోడ్డు చూసినా చెత్తమయంగా కనిపిస్తోంది. పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ప్రజారోగ్య విభాగంలోని శాశ్వత కార్మికులు వెయ్యి మంది, రోజువారీ కూలిపై తీసుకున్న 300 మందితో ప్రధాన రోడ్లు, ప్రాంతాల్లో చెత్తను వాహనాల ద్వారా యార్డుకు తరలించేందుకు యత్నిస్తున్నారు.

అయితే సమ్మెలో ఉన్న కార్మికులు వాహనాలను పార్కింగ్ యార్డుల నుంచి బయటకు తీయకుండా అడ్డుకుంటున్నారు. దీనివల్ల పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పనులు జరగడం లేదు. దీంతో మద్దిలపాలెం, శివాజీపాలెం, అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, కైలాసపురం, పెదవాల్తేరు వంటి ప్రాంతాల్లో రోడ్లన్నీ చెత్తమయంగా మారాయి. వాహనాలన్నీ చెత్త మీదుగానే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య నిర్వహణ పనులకు ఆటంకం కలిగించకుండా సమ్మెలో ఉన్న కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. అయినప్పటికీ కార్మికులు మాత్రం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకూ వెనుదిరిగే ప్రసక్తేలేదంటూ ఆందోళన కొనసాగిస్తున్నారు. బుధవారం సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నేత వెంకటరెడ్డి స్పష్టంచేశారు.

అంగన్‌వాడీల ఆగ్రహం



నోటీస్ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

- నోటీస్ ప్రతులు దహనం

జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మె 22వ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఈ నెల ఐదో తేదీలోగా విధుల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామంటూ కలెక్టర్ ఇచ్చిన నోటీస్ ప్రతులను జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ఉద్యోగులు దహనం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకూ వెనక్కి తగ్గేది లేదని, బెదిరింపులకు వెరవబోమని ఈ సందర్భంగా ఉద్యోగులు స్పష్టం చేశారు.

- వార్త Iలో



సైన్స్ మ్యూజియం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున ఉన్నారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన
- ఏడాదిలోగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటన

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రూ.6 కోట్లతో మ్యూజియం నిర్మాణానికి మంగళవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మ్యూజియం కోసం రూ.4.69 కోట్లు కేంద్రం ఇవ్వగా సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ రూ.93.8 లక్షలు సమకూరుస్తుందని వివరించారు. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికాన్ మ్యూజియం, సోలార్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సీఈఓ డాక్టర్ జయరామిరెడ్డి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ డి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

జ్ఞానాపురం, జనవరి 2: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్ర అకోలావొ జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో జ్ఞానాపురం సోఫియా జూనియర్ కాలేజీకి చెందిన ఇంటర్ విద్యార్థి ఎ.అశోక్ కుమార్ బాక్సింగ్ అండర్-19 విభాగంలో పతకం సాధించాడు. ఈ మేరకు మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థి, వారి తల్లి తండ్రులను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఫాదర్ శివ్యం విజయభాస్కర్ అభినందించి కళాశాలనుంచి మెమెంటో అందజేశారు.

నీలమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

అల్లిపురం, జనవరి 2: అల్లిపురం నీలమ్మ వేప చెట్టు అమ్మవారి దేవస్థానంలో మంగళవారం ఆలయ ఈఓ రమాబాయి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ రాజు సమక్షంలో హుండీ లెక్కించారు. రెండు నెలలకు గాను 1, 22, 497 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, చంద్రకళ పాల్గొన్నారు.


అరెస్టును అడ్డుకుంటున్న మహిళలు


టౌన్‌కొత్త రోడ్డులోని సూయజ్‌ఫాం ఎదుట బైఠాయించిన కార్మికులు, జనసేన నేతలు

పారిశుధ్య కార్మికులపై ఉక్కుపాదం

- వన్‌టౌన్ సూయజ్‌ఫారం వద్ద జనసేన ఆధ్వర్యంలో వాహనాల అడ్డగింత
- కార్మికులపై పోలీసుల ప్రతాపం.. తోపులాట..కొందరికి స్వల్ప గాయాలు

విశాఖపట్నం/ మహారాణిపేట జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వన్‌టౌన్ టౌన్‌కొత్తరోడ్డులోని మినీ సూయజ్‌ఫారం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సమ్మెతో చెత్త సేకరణ వాహనాలు, ఇతర లారీలను ఎంఎస్‌ఎఫ్‌నుంచి బయటకు వెళ్లనీయకుండా జనసేన నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు గేటు వద్ద ఉదయాన్నే బైఠాయించి అడ్డుకున్నారు. కార్మికులు భారీగా ఉండడంతో వాహనాలను బయటకు తీసుకెళ్లడానికి సిబ్బంది వెనుకాడారు. దీనిపై ప్రజారోగ్యవిభాగం అధికారుల సమాచారం మేరకు భారీగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రోప్‌పార్టీలతో వాహనాలకు అడ్డురాకుండా పోలీసులు యత్నించారు. అయితే, కార్మికులు పోలీసులను తోసుకుంటూ వెళ్లి వాహనాల ఎదుట రోడ్డుపై పడుకున్నారు. దీంతో పోలీసులు కార్మికులను బలవంతంగా లాగి వాహనాల్లోకి ఎక్కించేశారు. మహిళలను పోలీసులు బలవంతంగా లాగేయడంతో ఇబ్బంది పడ్డారు. ఈ పెనుగులాటలో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల చర్యను సీఐటీయూ నేత వెంకటరెడ్డి ఖండించారు. సమస్యలపై సమ్మెకు దిగితే ఇలా అరెస్టులు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అక్కయ్యపాలెం: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం నాయకులు, పారిశుధ్య కార్మికులు హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధనకు జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులోని సూయాజ్‌ఫాం ఎదుట రాత్రి సమయంలో నిద్రపోతున్నారు. మంగళవారం తెల్లవారు జామును చెత్త తరలించే వాహనాలు బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరి ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. వాహనాలకు అడ్డంగా ఉన్న కార్మికులను అరెస్ట్ చేసి వాహనాలను వార్డుల్లోకి పంపించారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం నాయకులు అప్పలరాజు, గౌరీశ్, ఒ.అప్పారావు తదితరులు ఉన్నారు. అలాగే, వివిధ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.


వాహనాలను అడ్డుకుంటున్న మహిళా కార్మికులు


తాటిచెట్లపాలెం సూయాజ్‌ఫాం వద్ద కార్మికుల తరలింపు


మహిళను ఈడ్చుకువెళ్తున్న పోలీసులు

హనుమాన్ చాలీసా

డాబాగార్డెన్స్, జనవరి 2: డాబాగార్డెన్స్‌లోని శ్రీ హరే రామ సంకీర్తన భక్త బృందం వేదికలో అంజనేయస్వామికి ప్రతీకరమైన మంగళవారం సందర్భంగా హనుమాన్ చాలీసా, శ్రీరామదాసుల కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పారు. శ్రీ సీతారామ ఆచార్యుల మంగళాశాసనంతో యు.కృష్ణంరాజు, లక్ష్మీ దంపతుల సారథ్యంలో ప్రముఖ సంకీర్తన సేవా సంస్థ శ్రీ హరేరామ సంకీర్త భక్త బంధ్యం, ఎస్.సీతారావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సంకీర్తనలు ఆలపించారు.శ్రీకాంతాచార్యులు, లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.


హనుమాన్ సంకీర్తన చేస్తున్న భక్త బృందం

నేషనల్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ



విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 2: జూనియర్, యూత్ నేషనల్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి నగరానికి చెందిన బ్లూ బ్యాడ్జి ఇంటర్నేషనల్ అంపైర్, ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్ వై శర్మ టెక్నికల్ అఫీషియల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతాలో ఈనెల ఆరు నుంచి జరిగే ఈటోర్నీకి శర్మ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఈనెల 16 నుంచి జరిగే ఆలిండియా పబ్లిక్ సెక్టార్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో పాల్గొంటున్న ఎల్ఐసీ జాతీయ జట్టుకు మెంటర్‌గా వ్యవహరిస్తారు.

మధ్యాహ్న భోజనాల్లో గుడ్డు సైజ్ తగ్గితే చర్యలు

- బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీతారాం

సీతమ్మధార, జనవరి 2: పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాల్లో చిన్న పరిమాణంలో గుడ్లను అందించడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆ గ్రహం వ్యక్తంచేశారు. చిన్న గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని నె హ్రూ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులు, అక్షయ పాత్ర ప్రతినిధులతో మాట్లాడారు. విద్యార్థులకు గుడ్డుతోపాటు ఇతర పోషకాలు కలిగి ఉండే ఆహారం అందించాలని సూచించారు. సీతమ్మధార ఎంఈవో డి.రామారావు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలన అధికారి జేఎస్ శాస్త్రి, అక్షయ పాత్ర ఫౌండేషన్ మేనజర్ వి.రామ్‌మోహన్, పాఠశాల హెచ్‌ఎం రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్.కరుణాకర్, బి.హెన్నా, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వర్సిటీ టెన్నిస్ టోర్నీలో రన్నరప్‌గా ఏయూ



ఏయూ జట్టు క్రీడాకారులతో కోచ్ లక్ష్మణ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 1: దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల పురుషుల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రన్నరప్‌గా నిలిచింది. విజయవాడ లయోలా కాలేజీలో జరిగిన ఈ టోర్నీలో ఏయూ జట్టు క్రీడాకారులు అనంతమణి, అఖిల్‌కుమార్ రెడ్డి, సంప్రీత్, అభిషేక్, మురళి, కృష్ణమోహన్ ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరారు. అయితే, ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో (చెన్నై) జరిగిన ఫైనల్స్‌లో అనూహ్య ఓటమితో ద్వితీయ స్థానంలో నిలిచి జైపూర్‌లో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ టోర్నీకి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కే సమత, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్, విభాగాధిపతి డాక్టర్ ఏ పల్లవి తదితరులు క్రీడాకారులను అభినందించారు.

కళాకారుల ప్రతిభకు గుర్తింపు


ఎంత పనిచేసావ్ చంటి చిత్రం టైటిల్ ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వనాథ్

డాబాగార్డెన్స్, డిసెంబరు 2: కళాకారుల ప్రతిభ వెలికితీయడంలో దర్శకుడు ఉదయ్‌కుమార్ ముందు ఉంటారని సినీ దర్శకుల సంఘం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ అన్నారు.మంగళవారం డాబాగార్డెన్స్ ఓ సమావేశ మందిరంలో 'ఎంత పనిచేసావ్ చంటి ' చిత్రం టైటిల్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్శకులు ఎంత పనిచేసావ్ చంటి చిత్రం టాకీపార్ట్ మొత్తం పూర్తి చేశారన్నారు. చిత్రంలోని హీరోగా ఉలిశెట్టి శ్రీనివాస్, హీరోహీరోయిన్‌గా దియారాజ్, నిహారిక నటించారన్నారు. సినిమాటోగ్రఫీ సంతోష్ డీజెడ్, సంగీతం పవన్‌సిద్ధార్థ, ఎడిటింగ్ శ్యామ్‌కుమార్, కథ,మాటలు సూర్యనారాయణ అందిస్తున్నారన్నారు.

భవానీ భక్తులతో కిటకిటలాడిన రైళ్లు


రైల్వే స్టేషన్‌లో మాలధారులు

విశాఖపట్నం, జనవరి 2: భవానీ భక్తులతో రైళ్లు కిటకిటలాడాయి. విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం భవానీ మాల ధరించిన భక్తులు దీక్షా విరమణకు మంగళవారం అధిక సంఖ్యలో బయలుదేరడంతో రైళ్లన్నీ రద్దీగా మారాయి. ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌నుంచి మొదలైన తాకిడి రాత్రి 11.20 గంటలకు బయలుదేరే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వరకు కొనసాగింది. విజయవాడ మీదుగా దాదాపు అన్ని రైళ్లలో భవానీ భక్తులు దీక్ష విరమణ కోసం బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం 11.00 గంటల నుంచి విశాఖ రైల్వే స్టేషనంతా భవానీ మాలదారుల భక్తులతో కిటకిటలాడింది. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717) ఎక్కేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు చేరడంతో తాకిడి నెలకుంది. ఇతర రైళ్లలో తాకిడి నెలకొంది.

జగన్ పాలనలో అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి: టీడీపీ

మహారాణిపేట, జనవరి 2: జగన్ పాలనలో ఏ ఒక్కరు సంతృప్తిగా లేరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ కేవలం బటన్ నొక్కే కార్యక్రమం తప్ప మరొకటి చేయడంలేదన్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రహదారులు ఏమైనా బాగున్నాయా? అని విమర్శించారు. జగన్ పాలనలో అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులతో పాటు అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో వారంతా జగన్ చిత్రపటానికి యాసిడ్‌తో అభిషేకం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ఘనత జగన్‌దేనన్నారు. దీనివల్ల ప్రజల సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం పార్టీయేనని స్పష్టమవుతుందన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు సీఎం సహకారం

- జనసేన పార్టీ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

సీతంపేట, జనవరి 2: ఆంధ్రుల హక్కుగా ఆవిర్భవించిన విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డుతున్నారని, ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫ ర్నేస్‌ను జిందాల్ కంపెనీకి అప్పగించారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావుతో కలిసి ఆయన మాట్లాడారు. జిందాల్‌కు చెందిన జేఎస్ డబ్ల్యూ గ్రూపు కడపలో ఉక్కుకర్మాగారం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని, అక్కడ పునాది రాయి కూడా పడకున్నా, ఆ ప్లాంట్ పేరిట జిందాల్ ప్రతినిధులు పదేపదే ముఖ్యమంత్రి జగన్‌ను కలుస్తూ విశాఖ ఉక్కు స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారన్నారు. ఈ క్రమంలోనే అత్యంత కీలకమైన బ్లాస్ట్‌ఫర్నేస్- 3ను ముఖ్యమంత్రి సహకారంతో చేజిక్కించుకున్నారన్నారు. కార్మికుల నుంచి, నగర వాసులు, అన్ని రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పట్టించుకోకుండా జిందాల్ ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 31 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న వైసీపీ విశాఖ ఉక్కుప్రైవేటీకరణపై కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా జిందాల్‌కు కట్టబెట్టేందుకు చూడడం దురదృష్టకరన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్రం సొంతంగా గనులు కేటాయించకపోవడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం నిర్మించిన గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాటాను సైతం గంపగుత్తగా అమ్మేశారన్నారు. వెయ్యి రోజుల నుంచి పోరాటం జరుగుతుంటే అనేక సార్లు విశాఖవచ్చిన సీఎం... స్టీల్‌ప్లాంట్ కార్మికుల శిబిరాన్ని చూడలేదన్నారు. నాయకులు గడపాల అప్పారావు, పీవీఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి చౌదరి, గంధం వెంకటరావు, గొల్లకోటి సామన్న, లక్ష్మణరావు, బోగిల శ్రీనివాస్‌పట్నాయక్, భార్గవ్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు: పీఏసీ సభ్యులు కోన

విశాఖ నగరంలో ఇటీవల బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ వైసీపీ ప్రభుత్వ వైఫల్యమేనని జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలపై సీఎం ఏడాదికి ఒక్కసారైన సమీక్ష చేయకపోవడంతోనే రాష్ట్రంలో మహిళలపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల పాలనలో ఒక్క విశాఖలో 42 గ్యాంగ్ రేప్‌లు నమోదయ్యాయన్నారు. సమావేశంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, జీవీఎంసీ జేఎస్‌పీ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, మహిళా రీజినల్ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి చౌదరి, శారదదేవి, కిరణ్ ప్రసాద్, త్రివేణి పాల్గొన్నారు.

వైసీపీ సమన్వయకర్తలు మార్పు

- అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి మలసాల భరత్‌కుమార్ నియామకం
- పాయకరావుపేటకు కంబాల జోగులు
- అరకు అసెంబ్లీ స్థానానికి ఎంపీ మాధవి పాడేరుకు విశ్వేశ్వరరాజు
- అరకు లోక్‌సభ స్థానం ఇన్‌చార్జిగా ప్రస్తుత పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- గొల్ల బాబూరావు, చెట్టి ఫాల్గుణలకు నో టికెట్

అనకాపల్లి/పాడేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జిగా కశింకోట మండలానికి చెందిన మలసాల భరత్‌కుమార్‌నియమితులయ్యారు. మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ కుమారుడైన ఆయన ఇటీవల వరకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. కాగా మంత్రి అమర్‌కు మరే ఇతర నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. ఇక పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులను సమన్వయకర్తగా నియమించింది. జోగులు 2004 ఎన్నికల్లో పాలకొండ నుంచి టీడీపీ తరపున, 2014, 2019 ఎన్నికల్లో రాజాం నుంచి వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ లోక్‌సభ స్థానంతో పాటు పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిను, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుతం అరకులోయ ఎంపీగా ఉన్న గొడ్డేటి మాధవిని, పాడేరు అసెంబ్లీ నియోజవర్గ ఇన్‌చార్జిగా ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించింది. దీంతో ఏజెన్సీలో వైసీపీ శ్రేణుల్లో కలకలం రేగింది. వచ్చే ఎన్నికల్లో ఆయా స్థానాల నుంచి వీరే ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. అరకులోయ అసెంబ్లీ స్థానానికి జి.మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణకు ఝలక్ ఇచ్చినట్టేనని స్పష్టమవుతున్నది. వచ్చే ఎన్నికల్లో ఫాల్గుణకు సీటు దక్కదని కొద్ది వారాలుగా ప్రచారం జరుగుతున్నది. మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఇది దాదాపుగా వాస్తవమైంది.

అయోధ్య రాముని అక్షతలు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 2 : అయోధ్యలో రామమందిరం చిత్రాలకు సంబంధించి కరపత్రాలను రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో విశ్వహిందూ పరిషత్, గ్రేటర్ 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ బాలరాముని పూజ పవిత్ర అక్షతలు వార్డులోని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలో నూతన మందిరంలోని గర్భగుడిలో బాలరాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు. నాయకులు బొడ్డేటి రవికుమార్, ఎస్‌వీ అప్పారావు గౌడ్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పుష్పాలంకరణలో కనకమహాలక్ష్మి

జగదాంబ కూడలి, జనవరి 2: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. అలాగే, అష్టదళ పద్మారాధన సేవలను ఉభయదాతలతో అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణకవచాలతోపాటు 108 స్వర్ణపుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మార్గశిర మాసం నేటికి 20 రోజులవుతున్నా అమ్మవారిని దర్శించుకునే భక్తులు తాకిడి తగ్గలేదు. ఆలయం వద్ద భక్తుల ఏర్పాట్లను ఈవో కె.శిరీష పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారి సన్నిధిలో నాద స్వర ఆరాధన


కచేరీలో డోలు, సన్నాయి వాద్య కళాకారులు

కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మంగళవారం వివిధ ఆల యాలకు చెందిన డోలు, సన్నాయి విద్వాంసులు నాదస్వర సన్నాయి మేళాల ఆరాధన చేశారు. అమ్మవారి సన్నిధిలో విద్వాంసులు సాయంత్రం నిర్వహించిన ఈ కచేరీ ఆహూతులను అలరించింది. ఈవో కె.శిరీష, అధికారులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, జనవరి 2: గ్రేటర్ 26వ వార్డు లలితానగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో రూ.52.75 లక్షల వ్యయంతో రోడ్లు, కాల్వలు, కల్వర్టులు, సీసీ ర్యాంప్ నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీలా వెంకటలక్ష్మి, బొడ్డేటి కిరణ్, ఏఈ నిహారిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ఏబీ బర్ధన్‌కు నివాళి

అల్లిపురం, జనవరి 2: యువతకు కామ్రేడ్ ఏబీ బర్ధన్ జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం బర్ధన్ వర్ధంతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బర్ధన్ కమ్యూనిస్టుగా జీవితంలో సుమారు 20 సార్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. సభ్యులు ఏ విమల, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎన్ క్షేత్రపాల్, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి దాడి గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

నేతలే తమపై విమర్శలు చేస్తుంటే ఎవరూ ఖండించకపోవడం తదితర పరిణామాలు దాడి వీరభద్రరావు కుటుంబాన్ని బాధించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మలసాల కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ కోసం మంత్రి అమర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సిఫారసు చేయడం, అధిష్ఠానం సానుకూలంగా స్పందించడాన్ని 'దాడి' కుటుంబం తట్టుకోలేకపోయింది. పార్టీ కోసం పనిచేస్తూ సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నప్పటికీ పెద్దల కరుణ లేకపోవడం, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్‌పై భరోసా లభించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఆత్మవంచన చేసుకుంటూ ఇటువంటి పార్టీలో ఉండలేమన్న ఉద్దేశంతో మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ఏకవాక్యంతో లేఖ రాసి పంపారు.

నేడు టీడీపీలోకి 'దాడి' కుటుంబం

వైసీపీకి రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు, అనుచరులు బుధవారం అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. దాడి వీరభద్రరావు తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశం పార్టీతోనే మొదలుపెట్టారు. 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1987లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రిగా, 1989 జనవరిలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీ తరపున శాసనమండలి సభ్యుడిగా ఎన్నియ్యారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. వీరభద్రరావు చిన్న కుమారుడు దాడి రత్నాకర్ 2012-13 మధ్య కాలంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్స్

... 5వ పేజీ తరువాయి

హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగించే సర్వీస్‌లలో సీట్లు రిజర్వు అయిపోయాయి. మరో 27 ప్రత్యేక సర్వీస్‌లలో కూడా రిజర్వేషన్ పూర్తయ్యింది. డిమాండ్ ఉంటే రాత్రి కూడా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు.

ఐదు కాంప్లెక్సుల నుంచి ప్రత్యేక సర్వీసులు

విశాఖ రీజియన్‌లోని ఐదు (ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక, స్టీల్ సిటీ, కూర్మన్నపాలెం) కాంప్లెక్సుల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలే

సంక్రాంతి ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలే వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు. డైలీ షెడ్యూల్స్‌కు వసూలు చేసే చార్జీలే ఈ ప్రత్యేక సర్వీసులకు కూడా వసూలు చేస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ మాదిరిగా అదనపు చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించారు. ప్రత్యేక సర్వీసులుగా నడిపేందుకు అవసరమైన బస్సులను ఇప్పటికే ఎంపిక చేసినట్టు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.సత్యానారాయణ తెలిపారు.



యారాడ తీరానికి తాబేలు కళేబరం

మల్కాపురం, జనవరి 2: యారాడ సముద్ర తీరానికి మంగళవారం ఓ తాబేలు కళేబరం కొట్టుకువచ్చింది. కాలుష్యం కారణంగా ఈ తాబేలు మృతి చెంది ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో షిప్ యార్డు సముద్రంలో అనేక చేపలు కాలుష్యం కారణంగా మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. కాగా యారాడ సముద్ర తీరాన మృత్యువాత పడివున్న తాబేలులు సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

ఉక్కు గేటు వద్ద బంగారు చైన్ లభ్యం

ఆధారాలతో వస్తే అప్పగిస్తామంటున్న పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 2: స్టీల్‌ప్లాంట్ పీపీ గేటు వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బందికి బంగారు చైన్ లభ్యమైంది. సరైన ఆధారాలతో వస్తే దీనిని సంబంధిత వ్యక్తికి అప్పగిస్తామని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు. గతనెల 14న 'ఏ' షిఫ్ట్‌లో ఉన్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఎంకే అజిత ద్విచక్ర వాహనదారుల ఐడీ కార్డులు తనిఖీ చేస్తుండగా కిందన బంగారు చైన్ ఉన్నట్టు గుర్తించి ఉక్కు అధికారులకు సమాచారం అందించారు. 17వ తేదీ వరకు ఎవరూ రాకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఆ చైన్‌ను అందజేశారు. సుమారు 14.730 గ్రాములు కలిగిన ఈ బంగారు చైన్ విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, దీనిని పోగొట్టుకున్నవారు సరైన ఆధారాలతో వస్తే అప్పగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

'ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం'

పెందుర్తి, జనవరి 2: ఏపీలో ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేగి దివాకర్ అన్నారు ఇక్కడి పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన హామీలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని సాధిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు ఆడారి రమేశ్‌నాయుడు ,షేక్ షఫీఉల్లా, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ హోమం రేపు

పెందుర్తి-రూరల్, జనవరి 2: కాలభైరవ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెదగాడి గోశాల వద్ద ఈ నెల నాలుగున అష్ట భైరవ సహిత కాలభైరవ హోమం నిర్వహించనున్నట్టు భైరవశక్తి ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కాలభైరవ ఉపాసకులు విశ్వసాయి గురూజీ సంకల్పంతో లోక కల్యాణార్థం ఈ క్రతువును నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

కోలాటం మహిళలకు చీరలు పంపిణీ

అగనంపూడి, జనవరి 2: జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలేనికి చెందిన సీతారామాంజనేయ మహిళల కోలాటం బృందానికి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ మంగళవారం చీరలు పంపిణీ చేశారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తున్న కోలాటం మహిళలను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, ఎలమంచిలి అప్పారావు, ప్రసన్న వినాయక యూత్ సభ్యులు ఎల్.సన్నీ, భాస్కర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

మల్కాపురం, జనవరి 2: శ్రీహరిపురం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ పన్నెండో వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల నాలుగో తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా సాయినాథునికి మహా కుంభాషేకం జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. అలాగే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, సకల దేవతలకు పూజలు, క్షేత్రపాలక నవగ్రహ గోపూజ, అగ్నిప్రతిష్ఠ హోమం, తదితర పూజాది కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **దెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు(నలుపు) 34, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 20, క్యారెట్ 42, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 100, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 58, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 38, ఆగాకర 84, పొటల్స్ 56, కీర దోస 24, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24, కంద 50, దేముడుచిక్కుడు 46, కొండ ఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



కణితిలో రోడ్డు పొడవునా ఉన్న చెత్తకుప్పలు



వడ్లపూడిలో రహదారిని ఆక్రమించిన చెత్తాచెదారం



గాజువాకలోని ఓ వీధిలో చెత్త పేరుకుపోయిన దృశ్యం

కంపు కొడుతున్న వీధులు

సమ్మెబాట వీడని కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు » ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు

అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలుతాయని భయాందోళన చెందుతున్న ప్రజలు

కూర్మన్నపాలెం, జనవరి 2: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టి రోజులు గడుస్తుండడంతో అన్ని వార్డుల్లోనూ చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. తమ ఆందోళనలో భాగంగా పారిశుధ్య కార్మికులు ఇళ్ల నుంచి చెత్త సేకరణను నిలిపివేయడంతో ప్రజలంతా వీధులు, కాలనీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద వ్యర్థాలను పడేస్తున్నారు. ఇలా పడేసిన చెత్త రోజుల తరబడి నిల్వ ఉండడంతో భరించరాని దుర్వాసన వస్తోందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కుక్కలు, ఆవులు, గేదెలు, పందులు చెత్తలో ఆహారం కోసం వెదుక్కుంటూ వాటిని మరింత చిందరవందర చేస్తుండడంతో రహదారులపైకి వ్యర్థాలు చేరుతున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంటుందని పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పర్మినెంట్ కార్మికులు చెత్తను అది తరలిస్తున్నా పూర్తి స్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెం, వుడా నగర్, తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తూ ఇళ్లలోకి ప్రవేశిస్తున్నందున అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి చెత్త తరలింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్రీహరిపురంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు



కొత్తపాలెం కూడలిలో పారిశుధ్య కార్మికులకు నచ్చజెబుతున్న పోలీసులు

శ్రీహరిపురంలో కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మల్కాపురం: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న పలువురు కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను, సీఐటీయూ నాయకులను మంగళవారం శ్రీహరిపురంలో మల్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో కాస్త గందరగోళ పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ మల్కాపురం జోన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పోలీసుల అరెస్టుల వద్ద తమ పోరాటాలు ఆగవని, కార్మికుల న్యాయ సమ్మతమైన కోర్కెలను సాధించే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం సొంత పూచీకత్తులపై వారిని పోలీసులు విడిచిపెట్టారు.

కొత్తపాలెంలో పోలీసుల సాయంతో చెత్త తరలింపు

గోపాలపట్నం: కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వీధుల్లో పేరుకుపోయిన చెత్త తరలింపునకు జీవీఎంసీ అధికారులకు తిప్పలు తప్పడం లేదు. 89వ వార్డు పరిధిలోని కొత్తపాలెం ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. దీనిని తరలించడానికి మంగళవారం మంగళవారం ఉదయం వాహనాలతో వచ్చారు. అయితే ఈ విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు నాగేంద్ర కాలనీ కూడలికి చేరుకుని చెత్త తరలించకుండా అడ్డుకున్నారు. దీంతో జెడ్సీ మల్లయ్యనాయుడు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సంతోశ్‌కుమార్, ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది అక్కడకు చేరుకుని చెత్త తరలింపునకు అడ్డు తగలరాదంటూ కార్మికులకు నచ్చజెప్పారు. అయితే వారు వెనక్కి తగ్గకపోవడంతో ముగ్గురు కార్మికులను వాహనంలో స్టేషన్‌కు తరలించారు. దీంతో వివాదం సద్దుమణగడంతో పోలీసుల సమక్షంలో చెత్తను తరలించారు. అనంతరం స్టేషన్ నుంచి కార్మికులను విడిచిపెట్టారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన గాజువాక జోనల్ కమిషనర్

నేటి నుంచి పారిశుధ్య పనులు చేపట్టనున్న వివిధ కర్మాగారాలకు చెందిన 350 మంది సిబ్బంది

గాజువాక, జనవరి 2: పారిశుధ్య సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం గంగవరం పోర్టు, ఏపీఐఐసీ, విశాఖ డెయిరీ, తదితర కర్మాగారాల యాజమాన్యాలతో జోనల్ కమిషనర్ పి.సింహాచలం చర్చలు జరిపారు. పారిశుధ్య పనులు చేపట్టేందుకు గాను కార్మికులను పంపేందుకు ఆయా యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. ఒక్కొక్క కర్మాగారం నుంచి 40 నుంచి 50 మంది కార్మికులను పంపుతున్నారు. దీంతో సుమారు 350 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉన్నందున బుధవారం నుంచి వారితో పాటు జీవీఎంసీ పర్మినెంటు కార్మికులు, మరికొంతమంది ప్రైవేటు కార్మికులు దాదాపు రెండు వందల మందితో కలిపి వీధులు, కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించనున్నారు. కాగా గ్రేటర్ పర్మినెంట్ సిబ్బంది తక్కువగా ఉన్నందున గత వారం రోజులుగా మెయిన్ రోడ్లు, కీలక జంక్షన్లలో మాత్రమే పారిశుధ్య పనులు చేపట్టారు. దీంతో వీధుల్లో కుప్పలుగా చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు వ్యాధులు ప్రబలుతాయని భీతిల్లుతున్నారు. ఈ తరుణంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు జెడ్సీతో పాటు ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ పలు కర్మాగారాల యాజమాన్యాలతో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. దీంతో కొంతవరకు పారిశుధ్య సమస్య తీరే అవకాశం ఉంది.

చీపురు పట్టిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు కాలనీ వాసులు, అపార్టుమెంట్ల వాసులు శ్రమదానంతో తొలగించేందుకు ముందుకు రావాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. శాంతినగర్, సంజీవయ్యనగర్, కరాస పరిసరాల్లోని చెత్తను తొలగించేందుకు ఆయన చీపురు పట్టి శుభ్రపరిచారు. అలాగే పలుచోట్ల చెత్తను లారీల ద్వారా తరలించే ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు మారుతి, విజయ్‌కుమార్, సీవో సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. కాగా 90వ వార్డులో చెత్త తరలింపు పనులను కాంట్రాక్టు కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు పదిమందిని అదుపులోకి తీసుకున్నారు.

కలెక్టర్ నోటీసులను దహనం చేసిన అంగన్‌వాడీలు

పెందుర్తి, జనవరి 2: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో వారు తమ నిరసనను తెలియజేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరం వద్దకు మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సీఎం జగన్ మోసకారి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు అందజేసి ఊరేగించారు. తాము ఆకలి మంటలతో బతుకులు ఈడుస్తుంటే వైసీపీ ప్రభుత్వం దున్నపోతు మాదిరిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఈ నెల ఐదో తేదీలోగా విధుల్లోకి చేరకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామంటూ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ ద్వారా జారీ చేసిన నోటీసులను పెందుర్తి కళాశాల కూడలిలో దహనం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తాము రోడ్డెక్కితే సీఎం జగన్ 'ఆడుదాం ఆంధ్ర' అంటూ పట్టీ ఆడుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, తదితరులు పాల్గొన్నారు.



నోటీసులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

నీటి సరఫరా కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో పాల్గొన్న తాగునీటి సరఫరా విభాగం కార్మికులు, తదితరులు

గాజువాక, జనవరి 2: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతుగా తాగునీటి సరఫరా విభాగం కార్మికులు కూడా మంగళవారం నుంచి ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా షీలానగర్ 10 ఎంజీడీ పంప్ హౌస్, కేబీఆర్ పంప్ హౌస్ వద్ద ధర్నాలు చేపట్టారు. తమ ఆందోళనలో భాగంగా గాజువాక ప్రాంతానికి నీటి సరఫరాను నిలిపివేశారు. అలాగే గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట, చినగంట్యాడ సీఐటీయూ కార్యాలయం వద్ద ప్రజారోగ్యశాఖ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, నీటి సరఫరా విభాగం కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కింద వేతనాలు అందించడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.అప్పారావు, సీఐటీయూ కార్యదర్శి ఎ.లోకేశ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను కార్మికులు చేపట్టారు.

నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 2: నిజం గెలవాలి-న్యాయం గెలవాలి అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అన్యాయంగా చంద్రబాబుపై కేసులు పెట్టి 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో ఉంచారన్నారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపంతో గాజువాక ప్రాంతానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో వారి కుటుంబాలను ఈ నెల ఐదో తేదీన భువనేశ్వరి పరామర్శించడంతో పాటు ఎన్టీఆర్ ట్రస్టు నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేస్తారన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, పులి వెంకటరమణారెడ్డి, విల్లా రామ్మోహన్‌కుమార్, బలగ బాలునాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

న్యాయవాదుల రిలే నిరసన దీక్షలు



రిలే నిరాహార దీక్షల శిబిరంలో న్యాయవాదులు

గాజువాక, జనవరి 2: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయస్థానాల సముదాయం ఎదుట పలువురు న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు కేవీ స్వామి, బీవీఎం కృష్ణ, ఎం.రామ సుధాకర్, న్యాయవాదులు బి.శశికళ, బీఎస్‌సీ దేవి, ఎల్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీరిదిద్దుతా: ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 2: గాజువాక నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలపడమే తన ధ్యేయమని ఎమ్మెల్యేతిప్పల నాగిరెడ్డి అన్నారు. 69వ వార్డు పరిధి తుంగ్లాంలో సుమారు రూ.మూడున్నర కోట్లతో సామాజిక భవన నిర్మాణానికి, తుంగ్లాం ప్రధాన రహదారి నిర్మాణానికి, నాతయ్యపాలెం శ్మశానవాటిక అభివృద్ధి పనులకు, నాతయ్యపాలెం-షీలానగర్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఆయా పనులను త్వరితంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, జెడ్సీ పి.సింహాచలం, వైసీపీ గాజువాక కన్వీనర్ ఉరుకూటి చందు, నాయకులు బి.సన్యాసిరావు, జి.గోపి, ఈగలపాటి యువశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జనవరి 2: పురుషోత్తపురం సబ్ స్టేషన్ 33/11కేవీ పరిధిలోని కృష్ణరాయపురం 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు వేపగుంట ఏఈ డీవీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కొత్త హెచ్‌బీకాలనీ, కృష్ణరాయపురం, వరలక్ష్మీనగర్, సంతోశ్‌నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేంద్ర పథకాల పట్ల అవగాహన పెంచుకోవాలి

కూర్మన్నపాలెం, జనవరి 2: కేంద్ర పథకాల పట్ల ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. వడ్లపూడి పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన వికసిత భారత్ ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రగతి కోసం కేంద్రంలోని పీఎం మోదీ ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయిస్తుందన్నారు. అయితే ఆయా పథకాలకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాల వివరాలతో ముద్రించిన వార్షిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా ఎల్లాజీ, నాయకులు సురేశ్, బొండా శ్రీదేవి, వెంకటరావు, టి.వెంకటరావు, డాక్టర్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ పనుల పరిశీలన

పెందుర్తి రూరల్, జనవరి 2: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఎంపీ నిధులతో నిధులతో చేపట్టిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం పరిశీలించారు. ఈ సెంటర్ మొదటి అంతస్తు నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తవ్వగా, ప్రస్తుతం రెండో అంతస్తు పనులకు రాడ్ బెండింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ డీఈ సుధీర్, ఏఈ శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు చందు, బి.దేముడుబాబు, కె.సంతోశ్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

జ్ఞానాపురం, జనవరి 2: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్ర అకోలావొ జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో జ్ఞానాపురం సోఫియా జూనియర్ కాలేజీకి చెందిన ఇంటర్ విద్యార్థి ఎ.అశోక్ కుమార్ బాక్సింగ్ అండర్-19 విభాగంలో పతకం సాధించాడు. ఈ మేరకు మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థి, వారి తల్లి తండ్రులను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఫాదర్ శివ్యం విజయభాస్కర్ అభినందించి కళాశాలనుంచి మెమెంటో అందజేశారు.

నీలమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

అల్లిపురం, జనవరి 2: అల్లిపురం నీలమ్మ వేప చెట్టు అమ్మవారి దేవస్థానంలో మంగళవారం ఆలయ ఈఓ రమాబాయి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ రాజు సమక్షంలో హుండీ లెక్కించారు. రెండు నెలలకు గాను 1, 22, 497 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, చంద్రకళ పాల్గొన్నారు.



అరెస్టును అడ్డుకుంటున్న మహిళలు



టౌన్‌కొత్త రోడ్డులోని సూయజ్‌ఫాం ఎదుట బైఠాయించిన కార్మికులు, జనసేన నేతలు

పారిశుధ్య కార్మికులపై ఉక్కుపాదం

- వన్‌టౌన్ సూయజ్‌ఫారం వద్ద జనసేన ఆధ్వర్యంలో వాహనాల అడ్డగింత
- కార్మికులపై పోలీసుల ప్రతాపం.. తోపులాట..కొందరికి స్వల్ప గాయాలు

విశాఖపట్నం/ మహారాణిపేట జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వన్‌టౌన్ టౌన్‌కొత్తరోడ్డులోని మినీ సూయజ్‌ఫారం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సమ్మెతో చెత్తసేకరణ వాహనాలు, ఇతర లారీలను ఎంఎస్‌ఎఫ్‌నుంచి బయటకు వెళ్లనీయకుండా జనసేన నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు గేటు వద్ద ఉదయాన్నే బైఠాయించి అడ్డుకున్నారు. కార్మికులు భారీగా ఉండడంతో వాహనాలను బయటకు తీసుకెళ్లడానికి సిబ్బంది వెనుకాడారు. దీనిపై ప్రజారోగ్యవిభాగం అధికారుల సమాచారం మేరకు భారీగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రోప్‌పార్టీలతో వాహనాలకు అడ్డురాకుండా పోలీసులు యత్నించారు. అయితే, కార్మికులు పోలీసులను తోసుకుంటూ వెళ్లి వాహనాల ఎదుట రోడ్డుపై పడుకున్నారు. దీంతో పోలీసులు కార్మికులను బలవంతంగా లాగి వాహనాల్లోకి ఎక్కించేశారు. మహిళలను పోలీసులు బలవంతంగా లాగేయడంతో ఇబ్బంది పడ్డారు. ఈ పెనుగులాటలో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల చర్యను సీఐటీయూ నేత వెంకటరెడ్డి ఖండించారు. సమస్యలపై సమ్మెకు దిగితే ఇలా అరెస్టులు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అక్కయ్యపాలెం: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం నాయకులు, పారిశుధ్య కార్మికులు హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధనకు జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులోని సూయాజ్‌ఫాం ఎదుట రాత్రి సమయంలో నిద్రపోతున్నారు. మంగళవారం తెల్లవారు జామును చెత్త తరలించే వాహనాలు బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరి ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. వాహనాలకు అడ్డంగా ఉన్న కార్మికులను అరెస్ట్ చేసి వాహనాలను వార్డుల్లోకి పంపించారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం నాయకులు అప్పలరాజు, గౌరీశ్, ఒ.అప్పారావు తదితరులు ఉన్నారు. అలాగే, వివిధ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.



వాహనాలను అడ్డుకుంటున్న మహిళా కార్మికులు



తాటిచెట్లపాలెం సూయాజ్‌ఫాం వద్ద కార్మికుల తరలింపు



మహిళను ఈడ్చుకువెళ్తున్న పోలీసులు

హనుమాన్ చాలీసా

డాబాగార్డెన్స్, జనవరి 2: డాబాగార్డెన్స్‌లోని శ్రీ హరే రామ సంకీర్తన భక్త బృందం వేదికలో ఆంజనేయస్వామికి ప్రతీకరమైన మంగళవారం సందర్భంగా హనుమాన్ చాలీసా, శ్రీరామదాసుల కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పారు. శ్రీ సీతారామ ఆచార్యుల మంగళాశాసనంతో యు.కృష్ణంరాజు, లక్ష్మీ దంపతుల సారథ్యంలో ప్రముఖ సంకీర్తన సేవా సంస్థ శ్రీ హరేరామ సంకీర్త భక్త బంధ్యం, ఎస్.సీతారావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సంకీర్తనలు ఆలపించారు.శ్రీకాంతాచార్యులు, లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.



హనుమాన్ సంకీర్తన చేస్తున్న భక్త బృందం

నేషనల్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ



విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 2: జూనియర్, యూత్ నేషనల్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి నగరానికి చెందిన బ్లూ బ్యాడ్జి ఇంటర్నేషనల్ అంపైర్, ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్ వై శర్మ టెక్నికల్ అఫీషియల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతాలో ఈనెల ఆరు నుంచి జరిగే ఈటోర్నీకి శర్మ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఈనెల 16 నుంచి జరిగే ఆలిండియా పబ్లిక్ సెక్టార్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో పాల్గొంటున్న ఎల్ఐసీ జాతీయ జట్టుకు మెంటర్‌గా వ్యవహరిస్తారు.

మధ్యాహ్న భోజనాల్లో గుడ్డు సైజ్ తగ్గితే చర్యలు

- బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీతారాం

సీతమ్మధార, జనవరి 2: పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాల్లో చిన్న పరిమాణంలో గుడ్లను అందించడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆ గ్రహం వ్యక్తంచేశారు. చిన్న గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని నె ప్రరా మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో మధ్యాహ్న బోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులు, అక్షయ పాత్ర ప్రతినిధులతో మాట్లాడారు. విద్యార్థులకు గుడ్డుతోపాటు ఇతర పోషకాలు కలిగి ఉండే ఆహారం అందించాలని సూచించారు. సీతమ్మధార ఎంఈవో డి.రామారావు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలన అధికారి జేఎస్ శాస్త్రి, అక్షయ పాత్ర ఫౌండేషన్ మేనజర్ వి.రామ్‌మోహన్, పాఠశాల హెచ్‌ఎం రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్.కరుణాకర్, బి.హెన్నా, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వర్సిటీ టెన్నిస్ టోర్నీలో రన్నరప్‌గా ఏయూ



ఏయూ జట్టు క్రీడాకారులతో కోచ్ లక్ష్మణ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 1: దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల పురుషుల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రన్నరప్‌గా నిలిచింది. విజయవాడ లయోలా కాలేజీలో జరిగిన ఈ టోర్నీలో ఏయూ జట్టు క్రీడాకారులు అనంతమణి, అఖిల్‌కుమార్ రెడ్డి, సంప్రీత్, అభిషేక్, మురళి, కృష్ణమోహన్ ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరారు. అయితే, ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో (చెన్నై) జరిగిన ఫైనల్స్‌లో అనూహ్య ఓటమితో ద్వితీయ స్థానంలో నిలిచి జైపూర్‌లో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ టోర్నీకి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కే సమత, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్, విభాగాధిపతి డాక్టర్ ఏ పల్లవి తదితరులు క్రీడాకారులను అభినందించారు.

కళాకారుల ప్రతిభకు గుర్తింపు

డాబాగార్డెన్స్, డిసెంబరు 2: కళాకారుల ప్రతిభ వెలికితీయడంలో దర్శకుడు ఉదయ్‌కుమార్ ముందు ఉంటారని సినీ దర్శకుల సంఘం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ అన్నారు.మంగళవారం డాబాగార్డెన్స్ ఓ సమావేశ మందిరంలో 'ఎంత పనిచేసావ్ చంటి ' చిత్రం టైటిల్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్శకులు ఎంత పనిచేసావ్ చంటి చిత్రం టాకీపార్ట్ మొత్తం పూర్తి చేశారన్నారు. చిత్రంలోని హీరోగా ఉలిశెట్టి శ్రీనివాస్, హీరోహీరోయిన్‌గా దియారాజ్, నిహారిక నటించారన్నారు. సినిమాట్రోగ్రఫీ సంతోష్ డీజెడ్, సంగీతం పవన్‌సిద్ధార్థ, ఎడిటింగ్ శ్యామ్‌కుమార్, కథ,మాటలు సూర్యనారాయణ అందిస్తున్నారన్నారు.



ఎంత పనిచేసావ్ చంటి చిత్రం టైటిల్ ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వనాథ్

భవానీ భక్తులతో కిటకిటలాడిన రైళ్లు

విశాఖపట్నం, జనవరి 2: భవానీ భక్తులతో రైళ్లు కిటకిటలాడాయి. విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం భవానీ మాల ధరించిన భక్తులు దీక్షా విరమణకు మంగళవారం అధిక సంఖ్యలో బయలుదేరడంతో రైళ్లన్నీ రద్దీగా మారాయి. ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌నుంచి మొదలైన తాకిడి రాత్రి 11.20 గంటలకు బయలుదేరే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వరకు కొనసాగింది. విజయవాడ మీదుగా దాదాపు అన్ని రైళ్లలో భవానీ భక్తులు దీక్ష విరమణ కోసం బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం 11.00 గంటల నుంచి విశాఖ రైల్వే స్టేషనంతా భవానీ మాలదారుల భక్తులతో కిటకిటలాడింది. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717) ఎక్కేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు చేరడంతో తాకిడి నెలకుంది. ఇతర రైళ్లలో తాకిడి నెలకొంది.



రైల్వే స్టేషన్‌లో మాలధారులు

జగన్ పాలనలో అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి: టీడీపీ

మహారాణిపేట, జనవరి 2: జగన్ పాలనలో ఏ ఒక్కరు సంతృప్తిగా లేరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ కేవలం బటన్ నొక్కే కార్యక్రమం తప్ప మరొకటి చేయడంలేదన్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రహదారులు ఏమైనా బాగున్నాయా? అని విమర్శించారు. జగన్ పాలనలో అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులతో పాటు అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో వారంతా జగన్ చిత్రపటానికి యాసిడ్‌తో అభిషేకం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ఘనత జగన్‌దేనన్నారు. దీనివల్ల ప్రజల సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం పార్టీయేనని స్పష్టమవుతుందన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు సీఎం సహకారం

- జనసేన పార్టీ ఆరోపణ

సీతంపేట, జనవరి 2: ఆంధ్రుల హక్కుగా ఆవిర్భవించిన విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డుతున్నారని, ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫ ర్నేస్‌ను జిందాల్ కంపెనీకి అప్పగించారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావుతో కలిసి ఆయన మాట్లాడారు. జిందాల్‌కు చెందిన జేఎస్ డబ్ల్యూ గ్రూపు కడపలో ఉక్కుకర్మాగారం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని, అక్కడ పునాది రాయి కూడా పడకున్నా, ఆ ప్లాంట్ పేరిట జిందాల్ ప్రతినిధులు పదేపదే ముఖ్యమంత్రి జగన్‌ను కలుస్తూ విశాఖ ఉక్కు స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారన్నారు. ఈ క్రమంలోనే అత్యంత కీలకమైన బ్లాస్ట్‌ఫర్నేస్- 3ను ముఖ్యమంత్రి సహకారంతో చేజిక్కించుకున్నారన్నారు. కార్మికుల నుంచి, నగర వాసులు, అన్ని రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పట్టించుకోకుండా జిందాల్ ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 31 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న వైసీపీ విశాఖ ఉక్కుప్రైవేటీకరణపై కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా జిందాల్‌కు కట్టబెట్టేందుకు చూడడం దురదృష్టకరన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్రం సొంతంగా గనులు కేటాయించకపోవడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం నిర్మించిన గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాటాను సైతం గంపగుత్తగా అమ్మేశారన్నారు. వెయ్యి రోజుల నుంచి పోరాటం జరుగుతుంటే అనేక సార్లు విశాఖవచ్చిన సీఎం... స్టీల్‌ప్లాంట్ కార్మికుల శిబిరాన్ని చూడలేదన్నారు. నాయకులు గడపాల అప్పారావు, పీవీఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి చౌదరి, గంధం వెంకటరావు, గొల్లకోటి సామన్న, లక్ష్మణరావు, బోగిల శ్రీనివాస్‌పట్నాయక్, భార్గవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

మహిళలకు రక్షణ కరువు: పీఏసీ సభ్యులు కోన

విశాఖ నగరంలో ఇటీవల బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ వైసీపీ ప్రభుత్వ వైఫల్యమేనని జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలపై సీఎం ఏడాదికి ఒక్కసారైన సమీక్ష చేయకపోవడంతోనే రాష్ట్రంలో మహిళలపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల పాలనలో ఒక్క విశాఖలో 42 గ్యాంగ్ రేప్‌లు నమోదయ్యాయన్నారు. సమావేశంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, జీవీఎంసీ జేఎస్‌పీ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, మహిళా రీజినల్ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి చౌదరి, శారదదేవి, కిరణ్ ప్రసాద్, త్రివేణి పాల్గొన్నారు.

వైసీపీ సమన్వయకర్తలు మార్పు

- అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి మలసాల భరత్‌కుమార్ నియామకం
- పాయకరావుపేటకు కంబాల జోగులు
- అరకు అసెంబ్లీ స్థానానికి ఎంపీ మాధవి పాడేరుకు విశ్వేశ్వరరాజు
- అరకు లోక్‌సభ స్థానం ఇన్‌చార్జిగా ప్రస్తుత పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- గొల్ల బాబూరావు, చెట్టి ఫాల్గుణలకు నో టికెట్

అనకాపల్లి/పాడేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జిగా కశింకోట మండలానికి చెందిన మలసాల భరత్‌కుమార్‌నియమితులయ్యారు. మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ కుమారుడైన ఆయన ఇటీవల వరకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. కాగా మంత్రి అమర్‌కు మరే ఇతర నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. ఇక పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులను సమన్వయకర్తగా నియమించింది. జోగులు 2004 ఎన్నికల్లో పాలకొండ నుంచి టీడీపీ తరఫున, 2014, 2019 ఎన్నికల్లో రాజాం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ లోక్‌సభ స్థానంతో పాటు పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మీను, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుతం అరకులోయ ఎంపీగా ఉన్న గొడ్డేటి మాధవిని, పాడేరు అసెంబ్లీ నియోజవర్గ ఇన్‌చార్జిగా ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించింది. దీంతో ఏజెన్సీలో వైసీపీ శ్రేణుల్లో కలకలం రేగింది. వచ్చే ఎన్నికల్లో ఆయా స్థానాల నుంచి వీరే ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. అరకులోయ అసెంబ్లీ స్థానానికి జి.మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణకు ఝలక్ ఇచ్చినట్టేనని స్పష్టమవుతున్నది. వచ్చే ఎన్నికల్లో ఫాల్గుణకు సీటు దక్కదని కొద్ది వారాలుగా ప్రచారం జరుగుతున్నది. మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఇది దాదాపుగా వాస్తవమైంది.

అయోధ్య రాముని అక్షతలు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 2 : అయోధ్యలో రామమందిరం చిత్రాలకు సంబంధించి కరపత్రాలను రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో విశ్వహిందూ పరిషత్, గ్రేటర్ 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ బాలరాముని పూజ పవిత్ర అక్షతలు వార్డులోని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలో నూతన మందిరంలోని గర్భగుడిలో బాలరాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు. నాయకులు బొడ్డేటి రవికుమార్, ఎస్వీ అప్పారావు గౌడ్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పుష్పాలంకరణలో కనకమహాలక్ష్మి

జగదాంబ కూడలి, జనవరి 2: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. అలాగే, అష్టదళ పద్మారాధన సేవలను ఉభయదాతలతో అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణకవచాలతోపాటు 108 స్వర్ణపుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మార్గశిర మాసం నేటికి 20 రోజులవుతున్నా అమ్మవారిని దర్శించుకునే భక్తులు తాకిడి తగ్గలేదు. ఆలయం వద్ద భక్తుల ఏర్పాట్లను ఈవో కె.శిరీష పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారి సన్నిధిలో నాద స్వర ఆరాధన

కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మంగళవారం వివిధ ఆల యాలకు చెందిన డోలు, సన్నాయి విద్వాంసులు నాదస్వర సన్నాయి మేళాల ఆరాధన చేశారు. అమ్మవారి సన్నిధిలో విద్వాంసులు సాయంత్రం నిర్వహించిన ఈ కచేరీ ఆహూతులను అలరించింది. ఈవో కె.శిరీష, అధికారులున్నారు.



కచేరీలో డోలు, సన్నాయి వాద్య కళాకారులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, జనవరి 2: గ్రేటర్ 26వ వార్డు లలితానగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో రూ.52.75 లక్షల వ్యయంతో రోడ్లు, కాల్వలు, కల్వర్టులు, సీసీ ర్యాంప్ నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీలా వెంకటలక్ష్మి, బొడ్డేటి కిరణ్, ఏఈ నిహారిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ఏబీ బర్ధన్‌కు నివాళి

అల్లిపురం, జనవరి 2: యువతకు కామ్రేడ్ ఏబీ బర్ధన్ జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం బర్ధన్ వర్ధంతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బర్ధన్ కమ్యూనిస్టుగా జీవితంలో సుమారు 20 సార్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. సభ్యులు ఏ విమల, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎస్ క్షేత్రపాల్, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి దాడి గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

నేతలే తమపై విమర్శలు చేస్తుంటే ఎవరూ ఖండించకపోవడం తదితర పరిణామాలు దాడి వీరభద్రరావు కుటుంబాన్ని బాధించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మలసాల కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ కోసం మంత్రి అమర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సిఫారసు చేయడం, అధిష్ఠానం సానుకూలంగా స్పందించడాన్ని 'దాడి' కుటుంబం తట్టుకోలేకపోయింది. పార్టీ కోసం పనిచేస్తూ సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నప్పటికీ పెద్దల కరుణ లేకపోవడం, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్‌పై భరోసా లభించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఆత్మవంచన చేసుకుంటూ ఇటువంటి పార్టీలో ఉండలేమన్న ఉద్దేశంతో మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ఏకవాక్యంతో లేఖ రాసి పంపారు.

నేడు టీడీపీలోకి 'దాడి' కుటుంబం

వైసీపీకి రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు, అనుచరులు బుధవారం అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. దాడి వీరభద్రరావు తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశం పార్టీతోనే మొదలుపెట్టారు. 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1987లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రిగా, 1989 జనవరిలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీ తరఫున శాసనమండలి సభ్యుడిగా ఎన్నియ్యారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. వీరభద్రరావు చిన్న కుమారుడు దాడి రత్నాకర్ 2012-13 మధ్య కాలంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్స్

... 5వ పేజీ తరువాయి

హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగించే సర్వీస్‌లలో సీట్లు రిజర్వు అయిపోయాయి. మరో 27 ప్రత్యేక సర్వీస్‌లలో కూడా రిజర్వేషన్ పూర్తయ్యింది. డిమాండ్ ఉంటే రాత్రి కూడా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు.

ఐదు కాంప్లెక్సుల నుంచి ప్రత్యేక సర్వీసులు

విశాఖ రీజియన్‌లోని ఐదు (ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక, స్టీల్ సిటీ, కూర్మన్నపాలెం) కాంప్లెక్సుల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలే

సంక్రాంతి ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలే వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు. డైలీ షెడ్యూల్స్‌కు వసూలు చేసే చార్జీలే ఈ ప్రత్యేక సర్వీసులకు కూడా వసూలు చేస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ మాదిరిగా అదనపు చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించారు. ప్రత్యేక సర్వీసులుగా నడిపేందుకు అవసరమైన బస్సులను ఇప్పటికే ఎంపిక చేసినట్టు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.సత్యనారాయణ తెలిపారు.

కమనీయం అప్పన్న కల్యాణం

సింహాచలం, జనవరి 2: వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్యకల్యాణోత్సవం మంగళవారం కమనీయంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్య సమర్పణలు చేశారు. మంత్రపుష్పం, నీరాజనాలిచ్చిన తర్వాత వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన పగల్‌పత్తు ఉత్సవాలు

సింహాచలం, జనవరి 2: వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో పదిరోజులుగా జరుగుతున్న పగల్‌పత్తు ఉత్సవాలు మంగళవారం రామానుజ నూతన్దాదితో పరిసమాప్తమయ్యాయి. గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో బంగారు తొళక్కియాన్‌లో, మరో పల్లకిలో ఆళ్వార్లను అధిష్ఠింపజేసి, తిరువీధి నిర్వహించారు. హంస మూలలో వేదికలపై ఉంచారు. నాలాయిరంలోని రామానుజ నూతన్దాది ఘట్టంలోని 100 పాశురాలను అనుసంధానం చేశారు. కర్పూర నీరాజనాల్చి, తీర్థగోష్ఠి జరిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తగరపువలస, జనవరి 2: అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎం.శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. 1, 2 వార్డుల్లో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం గిడిజాల పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మల్లికార్జున, ఎంపీడీవో లవరాజు, తహసీల్దార్ ఎల్.రామారావు, తదితరులున్నారు.

అయోధ్య అక్షతలు పంపిణీ

పద్మనాభం, జనవరి 2: మండలంలోని కృష్ణాపురం, విలాస్‌ఖాన్‌పాలెంలో మంగళవారం అయోధ్య అక్షతలను పంపిణీ చేశారు. రామాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాముని ఫొటో, ఆలయ ప్రతిష్ఠ కరపత్రాన్ని అందజేశారు.

జూనియర్ లెక్చరర్స్ సంఘం ఎన్నిక

భీమునిపట్నం, జనవరి 2: జిల్లా ప్రభుత్వ జూనియరు కళాశాలల అధ్యాపకుల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికల భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాలలో జరిగింది. ఈ కళాశాల లెక్చరర్లు బి.సింహాద్రప్పడు రాష్ట్ర కౌన్సిలరుగా, కె.సూరిబాబు జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ

భీమునిపట్నం, జనవరి 2: జీవీఎంసీ 3వ వార్డు నెహ్రూరోడ్‌లో వున్న మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గతంలో పరీక్షలు చేసిన వారిలో అవసరమైన వారికి మంగళవారం సత్యసాయి సేవ ఆర్గనైజేషన్ జోన్ 4 ఇన్‌చార్జి సత్యసాయి, ఎంఎస్ఎస్‌రావు, కరుణాకర్‌రావు మోహిసిన్ స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ కేర్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీ హెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు సుజాతాకుమారి, అల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో సన్ స్కూల్ విద్యార్థులకు ద్వితీయ స్థానం



విజేతలను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది, అతిథులు

భీమునిపట్నం, జనవరి 2: ఏపీ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్‌లో భీమిలి ది సన్ స్కూల్ అండర్ -17 బాలికల, బాలుర జట్లు ద్వితీయ స్థానం సాధించాయి. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన విజేతలకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అప్పారావు, సిహెచ్.రవికుమార్ పతకాలను, ప్రశంసాపత్రాలను అందించారు. కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పేర్నమిట్టలో జరిగిన పోటీల్లోవిద్యార్థులు పతకాలు సాధించారన్నారు.

సినిమా గైడ్

● **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **పిండం :** మోహిని (గాజువాక)
● **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 100, బరబాటి 58, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 38 , ఆగాకర 84, పొటల్స్ 56, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

వార్డుల్లో చెత్త కుప్పలు.. నగర వాసులకు అవస్థలు



వైఎస్ఆర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త



కొమ్మాది జంక్షన్ నుంచి పెట్రోల్ బంకుకు వెళ్లే దారిలో...



సింహాచలం పోస్టాఫీసు వీధిలో పరిస్థితి....

కొమ్మాది, జనవరి 2: మునిసిపల్ కార్మికుల సమ్మెతో మధురవాడ పరిసర ప్రాంతాల్లో చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అపార్టుమెంట్ల వద్ద చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఆయా పరిసరాలు దుర్గంధం వ్యాపించడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మారికవలస రాజీవ్ గృహకల్ప, కాలనీ, సాయిరాంకాలనీ, ఆర్.హెచ్.కాలనీ, పి.ఎం.పాలెం, బక్కన్నపాలెం తదితర ప్రాంతాల్లో ఎక్కడిక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కొమ్మాది జంక్షన్‌లో డ్రైనేజీలో చెత్త నిలిచిపోవడంతో రహదారిపై మురుగు ప్రవహిస్తోంది.

98వ వార్డులో క్షీణించిన పారిశుధ్యం

సింహాచలం: నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య కార్మికులు ఏడురోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె ప్రభావం మహావిశాఖ 98వ వార్డులో కనిపిస్తోంది. సమ్మె కారణంగా ప్రతినిత్యం వందలాది మంది వినియోగదారులు పయనించే పోస్టాఫీసు వీధి, పుష్కరిణి మార్గం, రాజవీధిలో చెత్త కనిపిస్తోంది. ప్రధాన వీధుల్లో దుర్గంధంతో ముక్కులు మూసుకుని నడవాల్సి వస్తోంది. చెత్త పేరుకుపోవటంతో దోమల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం: కలెక్టర్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఆనందపురం, జనవరి 2: అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు జగనన్న సురక్ష పథకం అమలుచేస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెల్లంకి గ్రామంలో జగనన్న సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు ఉచిత సేవలు అందించడమే ప్రామాణికంగా తీసుకుని వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పొరేట్ స్థాయి సేవలకు దీటుగా ఇంటి వద్దకే ప్రభుత్వం వైద్య మందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం వ్యయం రూ. 25 లక్షలకు పెంచిన ఘనత దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆరోగ్య సురక్షను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, డిప్యూటీ జిల్లా మెడికల్ అధికారి ఉమాదేవి, మండల ప్రత్యేకాధికారి సీతారాం, జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, నాయకులు మజ్జి వెంకటరావు, బంక సత్యనారాయణ, పిన్నింటి వెంటకరమణ, కాకర వెంకటరమణ, తహసీల్దార్ ఎల్.రామారావు, ఎంపీడీవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి చెప్పారు. అయినాడలో మంగళవారం రెండో విడత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మిజోరాం గవర్నర్ అభినందన



మనోజ్ఞను అభినందిస్తున్న గవర్నర్ హరిబాబు

భీమునిపట్నం, జనవరి 2: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సీసీపీ విద్యార్థిని పల్లా మనోజ్ఞ రాష్ట్రస్థాయిలో వెబ్‌సైట్ డిజైన్ కాంపిటేషన్‌లో బహుమతి పొందింది. ఈనేపథ్యంలో ఆమెను మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు అభినందించారు. 87 పాలిటెక్నిక్ కళాశాలలు పోటీపడగా, మనోజ్ఞ బహుమతిని గెలుచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రూపాకుల రవికుమార్, పల్లా భరత్ కుమార్, కంటుభుక్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో వైభవంగా ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, జనవరి 2: సింహాచలం స్వామివారి పూదోటలో కొలువైన పద్మావతి, అలిమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. షోడశోపచారాలు సమర్పించారు. తిరుప్పావైలోని 16వ పాశురాన్ని భక్తులందరితో కలిసి అర్చకులు రాగయుక్తంగా అనుసంధానం చేశారు. అనంతరం సప్తహారతులు సమర్పించి తీర్థగోష్ఠి, ప్రసాద వితరణలు జరిపారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించండి: ఎమ్మెల్యే ముత్తంశెట్టి



చీరలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మధురవాడ, జనవరి 2: చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మధురవాడ శిల్పారామంలో మంగళవారం అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా చేనేత కళాకారులు నేసిన వస్త్రాలు మన్నిక, నాణ్యత కలిగి ఉంటాయన్నారు. పండగ సమయాల్లో వీటిని ప్రజలు కొనుగోలు చేసి కళాకారుల శ్రమకు ప్రతిఫలం అందించాలన్నారు. వీవర్స్ సర్వీసెస్ సెంటర్ (విజయవాడ) అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానశేఖరన్ మాట్లాడుతూ ప్రదర్శనలో పది రాష్ట్రాల నుంచి వందమంది తమ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారన్నారు. గుంటూరు శిల్పారామం ఏఓ డి.పార్థసారథి మాట్లాడుతూ చేనేత చీరలు, కుర్తాలు, దుప్పట్లు విక్రయిస్తున్నట్లు చెప్పారు. మధురవాడ శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రదర్శన ఈ నెల 16 వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు. కార్యక్రమంలో పిళ్లా సుజాత పాల్గొన్నారు.

నమ్మివానిపేటలో వర్మీ కంపోస్టు యూనిట్



వర్మీకంపోస్టు యంత్రం

తగరపువలస, జనవరి 2: నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో వర్మీ కంపోస్టు తయారీకి జోనల్ కమిషనర్ బి.రాము శ్రీకారం చుట్టారు. మంగళవారం యార్డులో ఏర్పాట్లను పరిశీలించారు. నాలుగు వార్డులకు చెందిన తడి, పొడి చెత్తను యార్డులో డంపింగ్ చేస్తున్నామన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. తొలి విడతగా రూ. 25వేల వ్యయంతో ముడిసరకు తీసుకున్నామన్నారు. వీటితో ఎరువు తయారీకి యంత్రాన్ని తెచ్చామన్నారు. దీనిని విక్రయించడం ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు.

నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనం: సీఐ



ఫొటోగ్రాఫర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రామారావు

మద్దిలపాలెం, జనవరి 2: జంతు ప్రవర్తనతో నేరాలకు పాల్పడితే భవిష్యత్తు నాశనమవుతుందని మూడో పట్టణ సీఐ కోరాడ రామారావు ఫొటో గ్రాఫర్లను హెచ్చరించారు. నగరంలో మైనర్ అత్యాచార సంఘటన దృష్ట్యా మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫొటో గ్రాఫర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. బీచ్‌లో బాధపడుతున్న బాలికను ఓదార్చినట్టు నటించి, అత్యాచారం చేసిన ఫొటో గ్రాఫర్ జైలుకు వెళ్లిన సంఘటనను వివరించారు. అభాగ్యుల పట్ల మానవత్వంతో మెలగాలని, నేర ప్రవృత్తితో ఉంటే జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, నేరాలకు పాల్పడకూడదని హిత బోధ చేశారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే గంటా



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంటా

ఆనందపురం, జనవరి 2: మండలంలోని గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రామును మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. రాముకు ఇటీవల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. ఈ నేపథ్యంలో గంటా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కోరాడ రాము, కోరాడ వైకుంఠరావు, చందవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం వాసులకు కురపల్లిలో ఇళ్లు

భీమునిపట్నం (రూరల్) జనవరి 2: మండలంలోని లక్ష్మీపురం వాసులకు కురపల్లి గ్రామంలో జగనన్న ఇళ్లు కేటాయించడానికి అధికారులు అంగీకరించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన లబ్ధిదారుల సమావేశంలో మండల ఉపాధ్యక్షులు బంగారునాయుడు మాట్లాడుతూ చాలామంది తమకు కేటాయించిన ఇళ్లు చాలా దూర ప్రాంతాలలో ఉన్నాయని, అక్కడికి వెళ్లలేమని అంటున్నారని ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి తీసుకుని రావడంతో వారికి గ్రామాన్ని అనుకుని ఉన్న పద్మనాభం మండలం కురపల్లి గ్రామంలో కేటాయించడానికి అంగీకరించారని అన్నారు. ఈ సమావేశానికి సర్పంచి ఎల్.జగదీశ్వరరావు అధ్యక్షత వహించారు. ఉప సర్పంచి కరుభుక్త శ్రీను, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెకు టీడీపీ నేతల సంఘీభావం



కార్మికులకు అల్పాహారం అందిస్తున్న పిళ్లా వెంకటరావు

కొమ్మాది, జనవరి 2: జీవీఎంసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి తగదని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మారికవలస రాజీవ్ గృహకల్ప ఏరియాలో సమ్మెలో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి ఆయన సంఘీభావం తెలిపారు. పోరాటం చేస్తున్న కార్మికులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

మధురవాడ: మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలపై ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో ఉన్న కార్మికులను మంగళవారం పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. వారికి వెంకటరావుతో పాటు నాగోతి శివాజీ, నాగోతి సూర్యప్రకాశ్, పోతిన నాయుడు తదితరులు సంఘీభావం తెలిపి, కార్మికులందరికీ అల్పాహారం అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చర్చి సభ్యులు

వెంకోజీపాలెం, జనవరి 2: భానునగర్ సీయోను మందిరంలో మంగళవారం క్యాలెండర్‌ను పాస్టర్ వంక శివ శంకర్ లాజరస్ చర్చి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం చర్చిలోని వితంతువులకు రూ.600ల చొప్పున పింఛన్‌ను పంపిణీ చేశారు. కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు బి.శ్రీను, విజయ్, రాము, రమణ, రామ్మోహనం, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో శైనీశ్రీకి కాంస్య పతకం



పతకంతో శైనీశ్రీ

పెదవాల్తేరు, జనవరి 2: మొహాలిలో డిసెంబరు 29 నుంచి ఈనెల ఒకటో తేదీవరకు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల బాక్సింగ్ పోటీలలో స్థానిక తక్ష శిల ఐఏఎస్ అకాడమీలో డిగ్రీ చదువుతున్న శైనీశ్రీ (54- 57 కేజీల) విభాగంలో కాంస్య పతకం సాధించింది ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు జి.సాయిరాం, విద్యార్థులు శైనీశ్రీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

శాశ్వత కార్మికులతో పారిశుధ్యం పనులు

వెంకోజీపాలెం: పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె కారణంగా పోగులు పడిన చెత్తను జీవీఎంసీ శాశ్వత కార్మికులతో తొలగిస్తున్నారు. 16వ వార్డు హెచ్‌బీకాలనీ సులభ్‌కాంప్లెక్స్ వద్ద మంగళవారం తొలగించారు. చెన్నకేశవ అపార్టుమెంట్ వద్ద కల్వర్టుపై పేరుకుపోయిన చెత్తను తరలించారు. ఇన్‌స్పెక్టర్, శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, శ్రీను పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

కొమ్మాది, జనవరి 2: మత్తుపదార్థాలకు అలవాటుపడితే జీవితం నాశనమవుతుందని పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ అన్నారు. మంగళవారం చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు డ్రగ్స్ నిరోధంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విడతల వారీగా విద్యార్థులందరికీ అవగాహన కల్పించనున్నట్టు సీఐ చెప్పారు. ఎస్ఐ సునీత, పోలీసులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమునిపట్నం (రూరల్): విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.వినీషా సూచించారు. మంగళవారం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం కె.సురేశ్, భీమిలి ఎస్ఐ వి. రామకృష్ణ, ఎస్ఐ-2 పద్మావతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల విక్రయాలపై టోల్‌ఫ్రీ నంబర్లతో కూడిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. మాదక ద్రవ్యాలు, ఇసుక అక్రమ రవాణా, నాటుసారా తయారీ తదితర సమాచారాలను 14500 నంబరుకు తెలియజేయాలన్నారు. ఫిర్యాదుదారుల సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.

వెంకన్నకు నవనీత సేవ

భీమునిపట్నం, జనవరి 2: స్థానిక ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి నవనీత సేవ చేశారు. ఆంగ్ల సంవత్సర ఆలయ క్యాలెండరును ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్‌మూర్తి, కేవీ భానోజీరావు, శ్రీనివాసరావు, ఉశిరికల బంగార్రాజు, ప్రసాదరావుశర్మ ఆవిష్కరించారు.

దుర్గమ్మ ఆశీస్సులుండాలి

కొమ్మాది, జనవరి 2: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు దుర్గాలమ్మ ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చంద్రంపాలెం దుర్గాలమ్మ అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ధర్మకర్త పిళ్లాచంద్రశేఖర్, పిళ్లా సూరిబాబు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సర్పంచుల సదస్సుకు తరలిరండి

పద్మనాభం (రూరల్): మంగళగిరిలో బుధవారం నిర్వహించనున్న సదస్సుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తరలిరావాలని ఆ సంఘ అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి పిలుపునిచ్చారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సదస్సుకు రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల సర్పంచులు, ప్రతినిధులు హజరుకావాలన్నారు.

నేడు పెన్షన్‌ల పంపిణీ

పద్మనాభం(రూరల్): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక పెన్షన్ల పంపిణీ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 2120/2021

Between:
మధుపాడ వాసంతి అన్నపూర్ణ @ వాసంతి ...పిటీషనర్
And:
మధుపాడ అప్పలరాజు ...రెస్పాండెంట్

నోటీసు

To,
రెస్పాండెంట్: మధుపాడ అప్పలరాజు, S/o. లేటు దేముడు, హిందు, వయస్సు సుమారు 44 సం॥లు, నివాసం: డోర్ నెం. 204, యస్.వి.యల్. యస్. రెసిడెన్సీ, టి.వి.టవర్ కాలనీ, సింహాచలం, విశాఖపట్నం.

పై నెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై విడాకుల కొరకు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ సందు మీకు కోర్టు ద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్ లో మీ హాజరు కొరకు తేది.**05-02-2024**న వాయిదా అయివున్నది. ఆదినమున మీరు ఉ॥ గం॥**10.30**ని॥ లకు స్వయంగాగానీ, వకీలు ద్వారాగాని పై తెలిపిన కోర్టులో హాజరై మీ అక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పైపిటీషన్‌లో మీకు ఎటువంటి అక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టువారు మీపరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)
P. ASHOK KUMAR, Advocate
Visakhapatnam-40. **Cell: 92905 52390**

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం. ఫోన్ : 0891-2788465

సీల్డ్ టెండర్లు మరియు వేలం

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 11-10-2021 న రూ.1,06,11,905/- (అక్షరములా ఒక కోటి ఆరు లక్షల పదకొండు వేల తొమ్మిది వందల అయిదు రూపాయలు మాత్రమే) తేది 30-09-2021 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా 1) **శ్రీమతి పరిమి కరుణ,** W/o. వీర వెంకట సత్య ప్రశాత్, 2) **శ్రీమతి అన్నంరెడ్డి అమ్మాజీ,** W/o. ఎ. వరహాలరావు, 3) **శ్రీ పరిమి వీరవెంకట సత్యప్రశాత్,** S/o. వీరభద్రరావు వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని 13(4) క్రింద తే 29-01-2023 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ నుదహరించిన స్థిరాస్తిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నదీ అలాగ" వేలం వేయుటకు **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నక్కవానిపాలెం** బ్రాంచి, విశాఖపట్నం, ఫోన్ నెం. 0891-2788465 వద్ద **తేది 09-02-2024 శుక్రవారం ఉదయం 10-00** గంటలకు సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 09-02-2024 శుక్రవారం ఉదయం 10-00 గంటలకు
సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం

తనఖా ఆస్థి వివరములు	బకాయి మొత్తం 31-10-2023 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
భౌతికంగా బ్యాంకు ఆధీనంలో ఉన్న తనఖా ఆస్థి ఐటమ్ నెం. 2 - కో-ఆబ్లిగెంట్ / హామీదారు ఆస్థి	1,22,23,697/-	3,60,50,000/-	36,05,000/-

విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, గొరపల్లి గ్రామం పంచాయితిలోని సర్వే నెం.122/2, 122/3, 122/10, 124/8, 124/10, 124/11, 124/14 & 124/16 గాగల ఖాళీ స్థలం ఆస్తి.

హద్దులు:	1వ ప్రతి	2వ ప్రతి		1వ ప్రతి	2వ ప్రతి
తూర్పు	: జి. జానకమ్మ గారి స్థలం	ఇతరుల భూమి	పడమర	: కె. అచ్చన్న గారి స్థలం	జె. యర్రినాయుడు గారి స్థలం
దక్షిణం	: గెడ్డ	కె. చిన్నోడు గారి స్థలం	ఉత్తరం	: గెడ్డ	ఎగ్జిక్యూటెంట్‌కు చెందిన స్థలం

మొత్తం విస్తీర్ణం : 14714 చ॥ గజములు

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం** బ్రాంచి, **విశాఖపట్నం** పేరున చెల్లించబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 08-02-2024 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌పోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ టెండర్దారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో నైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థుడైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థుడైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/డిడి/ క్యాష్ రూపములో **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం**లో చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్దిష్ట గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డీఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ భాగం పైన నైనా అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం** వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థుడైన బిడ్డరు వర్తింపు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించుబడు అన్ని చార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా చార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏమైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణంనకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించడు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహ రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అప్పుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీచేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వాటి కాపీ కూడా జతచేయాలి.

తేది: 02-01-2024, విశాఖపట్నం **అధీకృత అధికారి, నక్కవానిపాలెం బ్రాంచి**